




# కొంటె ప్రశ్నలడిగేవారిపై పన్నీరు 'ఫన్' నీరు

1. మన పెద్దలు అబద్ధాలు ఆడకూడదంటారు కదా, మరి మనవాళ్ళే, వెయ్యి అబద్ధాలాడి ఓ పెళ్ళి చెయ్యమంటారు? ఇదేం తిరకాసు?

*పెళ్ళైతే ఎన్ని అబద్ధాలకైనా లైసెన్సు వచ్చినట్లే కదా. ఆ అబద్ధాలముందు ఇవేం పెద్ద లెక్కలోకి రావులే అని..!*

2. పెళ్ళిలో అరుంధతి నక్షత్రం చూపిస్తారు కదా, అరుంధతికి ఆవిడ పెళ్ళిలో ఏ నక్షత్రం చూపించారు?

*ఆవిడకి ఏ 'స్టార్' అవసరం లేదు. ఆవిడ 'స్టార్' తిరగబట్టే వశిష్టుడిని పెళ్ళాడింది.*

3. ప్రేమించి పెళ్ళాడడం మంచిదా? పెళ్ళాడి ప్రేమించడం మంచిదా?

*ప్రేమిస్తే పెళ్ళాడగలను, ప్రేమించనివ్వదు..పెళ్ళాడితే ప్రేమించ గలను పెళ్ళాడానివ్వదు! ప్రేమ బతుకింతే..పెళ్ళి గతి ఇంతే..!*

4. మగాడి పెళ్ళికి లేటయితే, "బ్రహ్మచారి ముదిరినా, బెండకాయ ముదిరినా పనికిరాడంటారు కదా" మరి ఆడవాళ్ళ పెళ్ళికి లేటయితే?

*ఆడవాళ్ళ పెళ్ళికి లేటైతే 'హజ్ బెండ కాయ' దొరుకుతుంది.*

5. రాముడి తరువాత పుట్టినవాడు భరతుడు కదా, మరి రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులంటారెందుకని?

*రాముడికి లక్ష్మణుడంటే ఇష్టమని ఆయన పక్కనే లక్ష్మణుడ్ని పేర్కొంటారు. రాముడికి లక్ష్మణుడంటే ఎందుకిష్టం అంటే లక్ష్మణుడి భార్య ఊర్మిళ ఎప్పుడూ నిద్రపోతుంది కాబట్టి అతను ఎప్పుడూ తనతోనే ఉంటాడని..!*

6. శివుడు చూస్తే, వంటినిండా బూడిద, మెళ్ళో పాము, తలంతా జడలు, ఉండేదేమో స్మశానం, మరి ఎవరైనా దంపతులని పార్వతి పరమేశ్వరులంటారు ఎందుకని? లక్ష్మీ విష్ణులనో, సరస్వతీ బ్రహ్మలని ఎందుకనరు?

*ఇందులో పెద్ద విశేషమేం లేదు..పెళ్ళైతే మిగిలేది బూడిదే అని కళ్ళకి కట్టినట్టు చూపించడానికంతే..!*

7. గాయకులు పాడేటప్పుడు, చెవి ఎందుకు మూసుకుంటారు? వాళ్ళ పాట వాళ్ళు వినలేకా?

*ఎదుటివాళ్ళు పడ్డ కష్టం తాము పడకూడదని..!*

8. తాడే పామై కరిచిందంటారు కదా, తాడెలా కరుస్తుంది?

*కొంతమందికి పసుపుతాడు రూపంలో..!*

9. బుద్ధుడు కూర్చుని తపస్సు చేస్తున్నట్టు ఉంటాడు కదా, మరి హుస్సేన్ సాగర్లో బుద్ధుడు నుంచుని తపస్సు చేస్తున్నట్లుగా ఉంటాడేం?

*ఏలినవారు ఎలానూ ఒకసారి తనని ముంచేశారు. జీవితంలో ఇంకెప్పుడూ మునిగిపోకూడదని అలా నిలబడి ఉంటాడు.*

10.రాయలసీమ రతనాల సీమ అన్నారు కదా, ఈ మధ్య సినిమాలు చూస్తే రాయలసీమ రాక్షస సీమలా అనిపిస్తోంది. మీ అభిప్రాయం?

*రత్నాలు దొరకాలంటే రాక్షసులుగా వుం డాలనేమో..!*

11. హైదరాబాదు ట్రాఫిక్ కి సొల్యూషన్ ఏమైనా చెప్పగలరా?

*'బాద్' మే మిలేంగే..!*

12. ఇంతకు ముందు కన్యాశుల్కం ఉండేది, ఇప్పుడేమో "వరకట్నం" వచ్చింది, ఈ వరకట్నం పోయి, ఏం వస్తుంది?

*శిశుకట్నం..!!*

చిలిపి ప్రశ్నలకి హాస్యబ్రహ్మ, హాస్యావధాని శంకరనారాయణ గారి నుంచీ కొంటె సమాధానాలు తెలుసుకోవాలని ఉందా!? ఇంకా ఆలశ్యమెందుకు.. మీ చిలిపి ప్రశ్నల్ని **editor@koumudi.net** కి వెంటనే పంపించండి..!!